# పరిహారం

## పాలగుమ్మి పద్మరాజు

"మీ పేరు ?"

"అదికూడా తెలుసుకోకుండా మా ఇంటికొచ్చారని నన్ను నమ్మమంటారా?" నేను సన్నగా నవ్వాను. కానీ తన ప్రశ్నకు సమాధానంకోసం ఆమె ఎదురు చూడలేదు. కొంగుతో నల్లవిరుగుడు చేవ కుర్చీ తుడిచి నన్ను కూర్చోమన్నట్టు సంజ్ఞచేసింది.

"మన్నించండి. వారు పోయిన తరవాత ఈ పదిరోజులూ ఇల్లు శుభ్రం చేయలేదు. తీరికలేక. మందారం! ఇన్‌స్పెక్టరుగారికి కాఫీ తెచ్చియ్యి." నే నెవరినో ఎలా కనిపెట్టా రన్నట్టు చూశాడు.

"మా దగ్గర దాపరికాలుండవండీ. మీరెవరో ఎందుకొచ్చారో నాకు తెలుసు. మా దంతా వంచన అనీ. మగవారిని వల్లో వేసుకోడం మాకు వెన్నతో పెట్టిన విద్య అనీ అంటుంటారు."

అది అబద్ధమని వివరించకుండానే తన పని తాను తిరిగి చేసుకోడం మొదలుపెట్టింది. ఒక అద్దాలబీరువా నిండా పుస్తకాలు దులిపి పేర్చుతోంది. మార్క్స్, ఎంజిల్స్, హెగెల్, చాణక్య నీతి, భారతం సంపుటాలు, హోవర్డ్ ఫాస్ట్ రచనలు, కృష్ణశాస్త్రి సంపుటాలు, గురజాడవారి డైరీలు, గీతగోవిందం, రకరకాలు. వీటన్నిటినీ సమన్వయించే అభిరుచి ఎలాంటిదో నాకు అంతుపట్ట లేదు.

"వారి పుస్తకాలు చదివి అలాగే మంచం పక్కన పారేసేవారు. వారిని ఆస్పత్రిలో చేర్చాక ఇవన్నీ తీసి సర్దడానికి తీరిక చిక్కలేదు......వెంటనే ఇవన్నీ పంపించెయ్యమని కబురంపారు ఆవిడ — రావుగారి భార్యగారు. భార్య మరి. ఆవిడకు హక్కుంది."

నాగమణి నిట్టూర్చింది.

"అటువంటి మహారాజే పోయాక ఇవి నన్ను రక్షిస్తాయా ? పంపేస్తాను."

"ఆయన ఆస్పత్రిలో ఉన్న ఇరవై రోజులూ మీరు రాత్రిపగలూ అక్కడే ఉన్నారట ?"

"తప్పలేదు. పాపం ఆవిడకి తీరిక లేదు. ఆయన...పోతారని తెలుసు... ఎన్నో వ్యవహారాలు...అస్తవ్యస్తంగా చేసిపెట్టారాయన..."

అనుకోకుండానే నా పెదవుల మీద చిరునవ్వు వచ్చినట్టుంది. ఆమె గుర్తించింది.

"నా భాష మీకు తెచ్చిపెట్టుకున్న భాషలా అనిపించొచ్చు. కాని తరతరాలుగా మాకు అలవాటైన భాష అది. ఇప్పుడిప్పుడు ఆ సంప్రదాయాలన్నీ పోతున్నాయి. కాని నేనా తోవలో పెరిగినదాన్ని...మా అమ్మగారు ఉద్దండ పండితులతో సమంగా వాదించగలిగేది. అంత చదువు నాకు అబ్బక పోయినా, ఇంగువ కట్టిన గుడ్డ కదండీ..."

పుస్తకాలు సర్దడం ఆపేసి, బీరువా పక్కనున్న ముక్కాలి పీట మీద కూర్చుంది. కళ్లలో అలసట. ఏదో పోగొట్టుకున్న దైన్యం.

"వారితో పరిచయం అయినప్పుడు నాకు ఇరవై అప్పుడే నిండాయి. ఎన్నికల ప్రచారాని కొచ్చారు. రాత్రి పదకొండు. వాన. వారి కారు మా ఇంటికి పదిగజాల దూరంలో ఆగిపోయింది. మెకానిక్ కోసం డ్రైవర్ని పంపారు. కిటికీలోంచి చూస్తున్నారు. అరగంటయినా అతను రాలేదు. అమ్మ గొడుగిచ్చి మా నౌకర్ని పంపింది, వారిని లోపలి కొచ్చి కూర్చోమని. వారు కొంచెంసేపు సందేహించారు. లోపలి కొచ్చారు. పడకకుర్చీ వేసింది అమ్మ. కూర్చున్నారు. 'మా బోటివాళ్ల ఇంటికి రావడానికి మీరు సంకోచించడం సహజం. అయితే నేను తమకన్న పదేళ్లు పెద్ద. మా అమ్మాయి ఇరవై ఏళ్లు చిన్న. ఇద్దరమూ ఈడూజోడూ కాదు, అంది అమ్మ. వారు అమ్మవంక నా వంకా చూశారు. అమ్మ మాటలకి నవ్వలేదు. కాని వారి కళ్లలో చమత్కారం తళుక్కుమంది. నేను గుర్తించాను. వారన్నారు, 'వోటు యాచించడానికి వచ్చినవాణ్ణి. మీకన్నా నేనే తక్కువ. నువ్వనుకొన్న సంకోచంకాదు, వోటుతో పాటు, ఆతిథ్యం కూడా అడగడం న్యాయం కాదని...' అమ్మ అంది, అంచేత మేం పిలిచేదాకా ఆగారన్న మాట.' వారు విశాలంగా నవ్వారు. అమ్మ కోడి కోయించింది. నేనే వండి పెట్టాను. రాత్రి మూడింటిదాకా అమ్మా ఆయనా గీత గోవిందాన్ని గురించి చర్చిస్తూంటే కూర్చుని విన్నాను. కారు బాగుపడి, ఆయన వెళ్ళిపోతూంటే, నా మనస్సు చివుక్కుమంది. కాని ఆ తరువాత ఆరేళ్లకిగాని మా పరిచయం స్థిరపడలేదు. అప్పటికి ఆయన జిల్లా పరిషత్తు ప్రెసిడెంటయ్యారు."



"ఆయనకి రాజకీయాలే ప్రాణం. దూరం చేస్తే ఆయనకి బతికుండగానే చావు. ఆడదానికి ఇల్లూ మొగాడే సర్వస్వం. మొగాడికి ఇల్లూ ఇల్లాలూ చాలవు. లోకం, పేరు, ప్రతిష్ఠ, ఆశయాలు – ఎన్నో ఉంటాయి. అయితే ఇల్లూ కావాలి. ఆడదాని ఆప్యాయతా కావాలి."

"నువ్వు సప్లయి చేశావుగా...నా బతుకు ఎందుకూ కాకుండా అయిపోయింది....నేనెవరికీ కాకుండా అయిపోయాను...కన్నబిడ్డకి నన్ను చూస్తే తిక్క...ఎన్నైనా చెపుతావు...నీకేం ? ...శ్రీరంగనీతులు...నాకు మిగిలిందల్లా వాడొక్కడు. పోలీసులు పట్టుకుంటారు ...జైల్లో పెడతారు..." ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది. "అతను ఫోర్జరీ చేశాడని రుజువేమిటి ?... నే చెపుతాను .. ఆయనే సంతకం.. " అప్పుడు గుర్తు కొచ్చినట్టుంది, నేను హాల్లో ఉన్నట్టు. కంగారుగా తలుపు తెరిచింది. అప్పుడు చూసింది రావుగారి భార్య నన్ను.

"నువ్వా ? ఇక్కడికి కూడా...." వెంటనే అయినింటి ఇల్లాలునని గుర్తు కొచ్చినట్టుంది. చ్రరున దొడ్డిదారిని వెళ్ళిపోయింది – పారిపోయినట్టు వెళ్ళిపోయింది. నాగమణి హాల్లో కొచ్చింది. ఆ కొద్దిక్షణాల్లో ఎంతో వయసు పైబడ్డట్టు కనిపించింది. జీవం లేనట్టు చతికిలపడింది. ముక్కాలి పీటమీద. గదిలో గోడని పటంలో రావుగారి ముఖంలో చిత్రమైన చిరునవ్వు. దీపాలు ఆనందంగా వెలుగుతున్నాయి కింద.

"మూడేళ్లయింది. ఆవిడ ఈ ఇంటి కొచ్చి. మళ్ళీ ఇప్పుడొచ్చింది, తప్పని సరి అయి. పాపం అమాయకురాలు – ఆడది....."

చటుక్కుని ఆమె ముఖంలో గాంభీర్యం, తీవ్రత, గొంతులో ఆవేశం.

"అటు చూసి చెప్పండి. ఆ మహరాజు సొంతానికి ఏమన్నా ఎప్పుడన్నా చేసుకున్నాడా ? ఆయన పేరు రచ్చకెక్కిస్తే మీకేం ఒలుకుతుంది ? ఇంక మనిషి మీద నమ్మకం ఉంటుందా ఈ లోకంలో ?..."

నేనేం సమాధానం చెపుతాను ? దీర్ఘంగా నిట్టూర్పు వదిలింది.

"నేనే ఆయన సంతకం పెట్టాను. మీరేం చేసినా సిద్ధంగా ఉన్నాను," అంది. నాకు మతిపోయింది. ఆమె చెయ్యలేదని నాకు తెలుసు.

"రాసి ఇమ్మంటారా ?"

"వొద్దు...ప్రభుత్వం సొమ్ము పోతే దర్యాప్తు చెయ్యడం మా విధి. వీలుగా దొరికినవారిమీద నేరం మోపి శిక్షించడం కాదు...."

"నేరం ఒకరిమీద రుజువయితే అనవసరంగా ఇంకొకరిమీద పడదుగా."

"అందుకని చెయ్యని నేరం మీ మీద మోపుకుంటారా ?" ఒక క్షణంపాటు నేను పోలీసు ఉద్యోగినన్న సంగతి మరిచిపోయాను – ఆమె గదిలోవున్న రావుగారి ఫోటో వంక చూసింది. ఆ చూపుల్లో ఎంతో తృప్తి, తహతహ, ఆవేదన, ఆనందం ఉన్నాయి.

"ఆయన దగ్గరనుంచి నేను పొందినదానికి విలువలేదు. ఆయనకోసం నేను ఏ పరిహారమైనా చెల్లిస్తాను...."

చివరికి ఆమె చెల్లించిన పరిహారం, ఇల్లు తాకట్టుపెట్టి రెండు లక్షలు ప్రభుత్వానికి కట్టి, రావుగారి కొడుకుమీద కేసు రద్దు చేయించింది.